క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



రన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ 2024–2025లో భాగంగా శుక్రవారం పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి 2కే రన్, మానవహారం, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. శంకర్‌పల్లి చౌరస్తాలో చైర్‌పర్సన్ విజయలక్ష్మి జెండా ఊపి రన్‌ని ప్రారంభించారు. బీడీయల్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి రోజు ఉదయం గంట పాటు వ్యాయామం చేయాలని, తద్వారా ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. అదేవిధంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో అవగాహన సమావేశం సైతం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాధ, చంద్రమౌళి, శ్రీనాథ్, కో–ఆప్షన్ సభ్యుడు, మేనేజర్ అంజన్‌కుమార్, పర్యావరణాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్: బుగ్గరామేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో దరఖాస్తు చేస్తున్న పత్రాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో ఉన్న బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానానికి అక్టోబర్ 16వ తేదీలోపు ఆసక్తి కలిగిన వారు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ జిల్లా కార్యాలయంలో తమ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఈఓ శ్రీనివాస్ ఫోన్ నెంబర్ 93964 51009కు సంప్రదించాలని సూచించారు.

ఎస్జీటీ యూనియన్ మండల కార్యవర్గం ఎన్నిక

మొయినాబాద్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం(ఎస్జీటీ యూనియన్) మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కన్వీనర్ డి.గణేశ్, కో–కన్వీనర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్జీటీ ఉపాధ్యాయులు మండలంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడిగా ఎం.వెంకట్రామిరెడ్డి, అధ్యక్షుడిగా పి.రాంచంద్రయ్య, మహిళా అధ్యక్షురాలిగా ఎం.స్వప్న, ప్రధాన కార్యదర్శిగా వై.రవికాంత్‌రెడ్డి, కోశాధికారిగా జి.వెంకటేశం, అదనపు కోశాధికారిగా కె.వెంకటలక్ష్మి, సలహాదారులుగా ఆర్.వేణుకుమార్, డి.కృష్ణ, మీడియా కన్వీనర్‌గా వి.సంతోషలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ గణేశ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

తాగునీటి సరఫరాపై శిక్షణ

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో ఉండే వాటర్‌మెన్‌లు నీటి సరఫరాతో పాటు మరమ్మతులపై శిక్షణ పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని చేవెళ్ల డివిజన్ మిషన్ భగీరథ అధికారి హరిత పేర్కొన్నారు. మిషన్ భగీరథ గ్రామీణ నీటి సరఫరాపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం మూడోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వాటర్ క్వాలిటీపై అవగాహన పెంచుకొని ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఈ శిక్షణతో వాటర్‌మెన్‌లు సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుంటుందని సూచించారు. మిషన్ భగీరథ మండల ఏఈ ఇమ్రాన్ అహ్మద్, శిక్షణ అధికారులు, వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాదారులకు నోటీసులు జారీ

షాద్‌నగర్: మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో బెల్టు దుకాణాలను ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్న వారికి శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్ నోటీసులు జారీ చేశారు. అక్రమంగా బెల్టు దుకాణాలను ఏర్పాటు చేసి మద్యం విక్రయించడం నేరమని, వెంటనే దుకాణాలను మూసివేయాలని నోటీసులు జారీ చేశారు. అయితే నాలుగు రోజుల క్రితం గ్రామంలో దుకాణాలు మూసివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ధర్నా నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో బెల్టు దుకాణాలను మూసివేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన గ్రామ కార్యదర్శి బాల్‌రాజ్ మద్యం విక్రయిస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు.

అధ్వాన దారులు.. అవస్థల ప్రయాణాలు

- గుంతలు, బురదమయంగా మారిన గ్రామీణ రోడ్లు
- గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



వెంకటాపూర్ బ్రిడ్జి వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు



చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు దుస్థితి

మొయినాబాద్: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. మండలంలోని ప్రధాన రోడ్లతోపాటు గ్రామాల రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఆ రోడ్లపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఇక పాదాచారుల పరిస్థితి మరీ అధ్వానం. ఈ రోడ్లపై రాత్రిపూట ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు పేర్కొంటున్నారు. గతంలో గుంతల్లో వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలా ఉన్నాయని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేసి తమ ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్ల పరిస్థితి ఇలా..

మొయినాబాద్ మండలంలోని సురంగల్–శ్రీరాంనగర్ రోడ్డు, కనకమామిడి–వెంకటాపూర్ రోడ్డు, మొయినాబాద్–చిలుకూరురోడ్డు, పెద్దమంగళారం–చందానగర్ రోడ్డు, తోలుకట్ట–నక్కలపల్లి రోడ్డు, ఎనికేపల్లి–బాకారం రోడ్డు, వెంకటాపూర్–నక్కలపల్లి రోడ్డు, రెడ్డిపల్లి–చిన్నమంగళారం రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాల కారణంగా రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నడవలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్లపై వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నిధులు మంజూరైనా మొదలు కాని పనులు..

మండలంలోని కొన్ని రోడ్ల అభివృద్ధికి గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరయ్యాయి. కానీ ఆ రోడ్ల పనులు ఇంతవరకు మొదలుకాలేదు. రోడ్ల అభివృద్ధి పనులు త్వరగా చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు పదేళ్లుగా రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదని గుంతల రోడ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని మండిపడుతున్నారు.

“ వాహనాలు చెడిపోతున్నాయి



వర్షాల కారణంగా మండలంలోని రోడ్లన్నీ గుంతలుగా మారాయి. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో ఐదు నిమిషాల్లో వెళ్లే దూరానికి అరగంటకుపైగా సమయం పడుతోంది. ఈ రోడ్లపై ప్రయాణం నరకంగా మారింది. గుంతల్లో వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు కూడా చెడిపోతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలి.

– గొడుగు యాదయ్య, కేతిరెడ్డిపల్లి, మొయినాబాద్

త్వరలోనే మరమ్మతులు



మండలంలోని చాలా గ్రామాల రోడ్లు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. అయితే గతంలోనే కొన్ని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. వర్షాల కారణంగా పనులు మొదలుపెట్టలేదు. త్వరలోనే ఆ పనులు మొదలవుతాయి. మిగిలిన రోడ్లకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ, మొయినాబాద్

సభ్యత్వ నమోదుకు స్పందన

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



షాబాద్: నాగర్‌గూడలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే, తదితరులు

షాబాద్: బీజేపీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిర్మలాపూర్, రేగడిదోస్వాడ, నాగర్‌గూడ, దేవునిగడ్డ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపడుతున్నట్లు చెప్పారు. బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పీసరి సతీశ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి మాణయ్య, జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, బీజేవైఎం మండల అధ్యక్షులు మహేశ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రవి, దళిత మోర్చా అధ్యక్షుడు మహేందర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కేశంపేట: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు రొల్ల రఘురాంగౌడ్ అన్నారు. మండల పరిధిలోని బైర్ఖాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రఘురాంగౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. హామీలను అమలు చేసేవరకు బీజేపీ ప్రజలతో కలిసి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, నర్సింగ్, అశోక్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, శ్యామల, శంకర్‌రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల చేయూత



బ్యాగులు పంపిణీ చేస్తున్న దాత చంద్రయ్య

షాబాద్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరిగి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య అంకిత ఫౌండేషన్ ఎన్జీఓ సంస్థ ద్వారా స్కూల్ బ్యాగులు, కూర్చోవడానికి మ్యాట్లు, చెప్పులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ అనితాకుమారి

షాబాద్: దుంపల పంట సాగుపై రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం రాజేంద్రగనగర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.అనితాకుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో రైతు అమృత్‌రాజ్ వ్యవసాయ క్షేత్రంలో కుర్వగూడ, సర్దార్‌నగర్, కక్కులూర్ గ్రామాల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూరగాయల పరిశోధనా స్థానం కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం జిల్లా అఖిల భారత దుంపల సమన్వయ పరిశోధన పథకం ద్వారా రైతులు పంటల సాగు ఎలా చేయాలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. దుంపల సాగుపై రైతులు తీసుకోవాల్సిన మెలకువలపై క్లుప్తంగా వివరించారు. షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు మొరంగడ్డ, చేమదుంప, కంది పంటల సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. రైతులు సాగు చేసిన పంటను క్షేత్ర సందర్శన చేసి రైతులకు సస్యరక్షణ పద్ధతులు, ఎరువుల యాజమాన్యం వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. రైతులందరికీ చేతిపంపులు, మొరం తీగను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సురేశ్, డాక్టర్ నిఖిల్, ఏఈఓలు కుమార్, ప్రశాంత్, ఆనంద్, రైతులు తదితరులు ఉన్నారు.

పరిహారం అందించేందుకు కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



న్యాయవాది వీరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

షాద్‌నగర్: స్పాంజ్ ఐరన్ పరిశ్రమల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. స్పాంజ్ ఐరన్ పరిశ్రమలపై హైకోర్టులో ఫిల్ దాఖలు చేసి సుదీర్ఘ కాలం విచారణ తర్వాత కోర్టు తీర్పు వెల్లడించింది. కోర్టులో విజయం సాధించిన సందర్భంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న న్యాయవాది వీరేందర్‌రెడ్డిని ఆయన కుమారుడు, కోడలు తాండ్ర శ్రావణ్‌రెడ్డి, తాండ్ర విశాల సమక్షంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలుష్య కారక పరిశ్రమపై ఎన్నో ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేసి రైతులకు మేలు చేసేందుకు తాండ్ర వీరేందర్‌రెడ్డి చేసిన కృషి హర్షనీయమన్నారు. వీరేందర్‌రెడ్డిని ఈ ప్రాంత ప్రజలు, రైతులు ఎప్పటికీ మరిచిపోరన్నారు. బాధిత రైతులకు పరిహారం ఇప్పించేందుకు ప్రభుత్వం తరఫున తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు అందె మోహన్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల, శ్రావణ్, రమాదేవి, నాగమణి, లక్ష్మణ్‌గౌడ రమాదేవి, రాజేశ్, సాయి, వంశీ, అర్జున్, నవీన్, ప్రదీప్, నరేందర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల ఊపిరి కొండా లక్ష్మణ్



షాద్‌నగర్‌లో కొండా లక్ష్మణ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న కొండా లక్ష్మణ్ విగ్రహానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, బక్కని నర్సింలు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్యలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొలి దశ తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర్య పోరాటం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టారని, ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోట జనార్దన్, ఒగ్గు కిషోర్, చెన్న బాల్‌రాజ్, బాస రాజేందర్, నరేందర్, రమేశ్, బుచ్చయ్య, యాదగిరి, చెరుకు రాములు, మురళీ, శ్రీనివాస్, నర్సింలు, ఆంజనేయులు, లక్ష్మి, వరలక్ష్మి, కొందూటి నరేందర్, చెంది తిరుపతిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎంఎస్ నటరాజన్, కొంకళ్ళ చెన్నయ్య, బస్వం, హరినాథ్‌రెడ్డి, కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: తెలంగాణ సాధనకు అహర్నిశలు కష్టపడిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీజేపీ నాయకుడు అడెట్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ఉపాధ్యక్షులు కృష్ణాగౌడ్, శర్వలింగం నాయకులు ఉన్నారు.

సహకార సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్

కేశంపేట: ప్రాథమిక సహకార సంఘం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ప్రాథమిక సహకార సంఘం ప్రత్యేక మహాజన సభను శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ ఎరువులు, మందులను అందిస్తున్నామన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, సంఘం ఆర్థికాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఈఓ అనిల్, డైరెక్టర్ మఠం శేఖర్, కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు

షాబాద్: మహాలక్ష్మి పథకం నిరుపేద మహిళలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహాలక్ష్మి లబ్ధిదారులకు ఎల్‌పీజీ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. దేశ చరిత్రలో రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, మాజీ ఉపసర్పంచ్ రవి, గ్రామస్తులు న్నారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ఉత్తేజంగా దూసుకుపోవడం అభినందనీయమని సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని టోల్‌కట్ట సమీపంలో గల చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాలలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు అభినంద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జోనల్ స్థాయి క్రీడల్లో చేవెళ్ల నియోజకవర్గంలో షాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల నుంచి 21 బృందాలు పాల్గొనగా అందులో చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించి బహుమతులు పొందడం అభినందనీయమన్నారు. ఈ అభినందన సభలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిపైరును కాపాడుకోండి

కొందుర్గు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరిపైరుకు ఎండు తెగులు సోకే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి అన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే ఈ తెగులు నుంచి పంటను కాపాడుకోవచ్చని ఆయన అన్నారు. శుక్రవారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని జిల్లేడ్ గ్రామ శివారులో వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిపంట ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉందని, ఈ దశలో అధికంగా బ్యాక్టీరియా, ఆకు ఎండుతెగులు, అగ్గితెగులు సోక అవకాశం ఉందని, తెగులు ఆశించినప్పుడు పసుపు రంగు మచ్చలు పైనుంచి కిందికి వస్తాయన్నారు. ఈ సమయంలో నత్రజని ఎరువులను నిలిపివేయాలన్నారు. తెగులు నివారణకు అదేవిధంగా కాపర్ హైడ్రాక్సీ క్లోరైడ్ 400 గ్రాములు, ప్లాంటోమైసిన్ 80 గ్రాములు కలిపిన మిశ్రమాన్ని ఎకరాకు వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు సోనిశ్రీ, స్వాతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘సీజనల్’పై అప్రమత్తత తప్పనిసరి



కొత్తూరు: శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహించే సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు హరికిషన్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో విధులు నిర్వహించే పారిశుద్ధ్య, ఇతర సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విధుల్లో భాగంగా సిబ్బంది గ్లౌజులు, మాస్కులు, ఇతర రక్షణ కవచాలను వినియోగించాలని కోరారు. సిబ్బంది ఏమాత్రం అనారోగ్యాలకు గురైన నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. సిబ్బంది పనితీరుతోనే పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం సక్రమంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ బాలాజీ, నాయకులు దేవేందర్‌యాదవ్, కోస్గి శ్రీనివాస్, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా–హీ–సేవలను సద్వినియోగం చేసుకోవాలని నందిగామ పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని పీహెచ్‌సీలో శుక్రవారం డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బందికి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని 9 గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లకు ఆరోగ్య పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, సూపర్‌వైజర్ సయ్యూద్దీన్, ఫార్మాసిస్ట్ రాజశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు సునీత, స్వరూప, రాజ్యలక్ష్మి, సువర్ణ, ఆశవర్కర్లు, గ్రామ కార్యదర్శులు మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

కొందుర్గు: కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమ్రిత జోసెఫ్ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ లుదియా, ఎంపీహెచ్ఓ శ్రీనివాస్, హెచ్ఎస్ పుష్పలత, అశ్వాక్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు



మొక్కలు నాటుతున్న సంస్థ ప్రతినిధులు

కొత్తూరు: వాతావరణంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమర్థనం సేవా సంస్థ ప్రతినిధి శ్రావణ్‌కుమార్ కోరారు. ఇందులో భాగంగా ఆయన మండలంలోని పెంజర్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో పీడబ్ల్యూసీ కార్మికులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయనతో పాటు పలువురు మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నియంత్రించని పక్షంలో భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలు, గనుల కారణంగా శబ్ద, వాయు, జల కాలుష్యాలు విపరీతంగా పెరిగాయన్నారు. వీటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో అంగూర్‌నాయక్, సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.